క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దూల్మిట్ట మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. 33కేవీ ఫీడర్ లైన్ కింద ఉన్న చెట్లకొమ్మలు తొలగించే పనుల వల్ల సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30ని.ల వరకు విద్యుత్ నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. పట్టణంలోని 33కేవీ రంగథాంపల్లి ఫీడర్, 33కేవీ పొన్నాల ఫీడర్, 33/11కేవీ రంగథాంపల్లి ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోమటి చెరువు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, రంగథాంపల్లి, మైత్రివనం, వినాయకనగర్, విశ్వేశ్వర్‌నగర్, రాజేంద్రనగర్, మహాశక్తి నగర్, ఆదర్శనగర్, కుశాల్‌నగర్, ఎల్ఐసీ కాలనీ, బృందావన్‌కాలనీ, శ్రీనివాస్‌నగర్, సాజీద్‌పుర, కాకతీయనగర్, విద్యనగర్, మణికంఠకాలనీ, కేసీఆర్ నగర్ ప్రాంతాలలో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాల, ఎన్సాన్‌పల్లి గ్రామాలలో సోమవారం ఉదయం 9 గంటల నుండి 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయశాఖ కమిషన్ సభ్యురాలికి అభినందనలు



భవానిరెడ్డితో కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): వ్యవసాయశాఖ కమిషన్ సభ్యులుగా నియామకమైన భవానిరెడ్డిని ఆదివారం సిద్దిపేట జిల్లా నాగిరెడ్డిపల్లెలోని ఆమె స్వగృహంలో కాంగ్రెస్ మండల నాయకులు మల్లికార్జున్, గాదం స్వామి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని విన్నవించారు.

రెచ్చగొట్టే రాజకీయాలు వద్దు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటజోన్: మైనంపల్లి హన్మంతరావు సిద్దిపేటలో రెచ్చగొట్టే రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జంగిటి శ్రీనివాస్ మండిపడ్డారు. ఆయన చిన్నకోడూరులో ఆదివారం మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటలో మైనంపల్లి అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. సిద్దిపేట అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కనకయ్య, రమేశ్, రాజశేఖర్, ఆనంద్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులను బెదిరిస్తే ప్రతి దాడులకు దారితీస్తాయని బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్, రజనీకాంత్, పెర్క బాబు అన్నారు. సిద్దిపేటలో ఇటీవల పరిణామాల నేపథ్యంలో రెండు రోజులుగా కొందరు ఫోన్‌ద్వారా బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తున్నారన్నారు. అరవింద్, సంతు, ఆకాశ్ పాల్గొన్నారు.

విమర్శిస్తే ఊరుకోం..



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ నేతలను విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతారావును చూస్తే బీఆర్ఎస్ నాయకులకు భయం పుడుతోందన్నారు. ఆధారాలు లేకుండా బీఆర్ఎస్ నాయకులు అభియోగాలు మోపితే పరువునష్టం దావా వేస్తామని చెప్పారు. నాయకులు శంకర్, మధు, గయాజొద్దీన్, పరశురాములు, నజ్జు, అనిల్ పాల్గొన్నారు. అర్హతలేని వ్యక్తులతో ప్రెస్ మీట్‌లు పెట్టించి కాంగ్రెస్ నాయకులను విమర్శించడం బీఆర్ఎస్ నాయకులకు తగదని 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మి మండిపడ్డారు. సిద్దిపేట 37వ వార్డులో ఆమె మాట్లాడుతూ.. వార్డులో హరీశ్‌రావు అభివృద్ధి చేశారని చెప్పడం పూర్తి అవాస్తవమన్నారు. దళితబంధు పథకంలో తాను అవినీతికి పాల్పడినట్లు ఆరోపించడంలో వాస్తవం లేదని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఆనంద్, శ్రీనివాస్, మధు, రాములు, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క.. కలుషితం పక్కా

- రామసముద్రం చెరువంతా దుర్గంధం
- చేపల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం
- మురుగంతా ఆ చెరువులోకే..



గుర్రపుడెక్కతో నిండిపోయిన రామసముద్రం చెరువు

దుబ్బాకటౌన్: చెరువుల్లో పెరుగుతున్న గుర్రపుడెక్కతో నీటిలోని చేపలు, ఇతర జలచరాలకు భారీ నష్టం వాటిల్లుతోంది. పట్టణంలోని రామసముద్రం చెరువు కొన్ని రోజులుగా గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు నిండి దర్శనమిస్తోంది. దాదాపు సగం చెరువును గుర్రపుడెక్క ఆక్రమించింది. చెరువు మొత్తాన్ని ఆక్రమిస్తుండడంతో నీటి సాంద్రత దెబ్బతింటోంది. నీరు కూడా కలుషితం అవుతుండడంతో చేపల్లో ఎదుగుదల లోపిస్తోంది. గుర్రపుడెక్క నీటిలోని ఆక్సిజన్‌ను పీల్చుకోవడం వల్ల చేపలు, ఇతర జలచరాల మనుగడకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

వాడకపు నీరంతా అక్కడికే..

పట్టణంలోని పలువార్డుల్లోని కాలువల నుంచి వస్తున్న మురుగంతా చెరువులోకే చేరుతోంది. దీంతో గుర్రపుడెక్క బాగా వ్యాపిస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

అలాగే దుర్గంధం వెదజల్లుతోంది. ఉదయం, సాయంత్రం కట్టపైకి వ్యాయమానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యేటా మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధికి ఉచితంగా చేపపిల్లలను చెరువులో వదులుతున్న ప్రభుత్వం అందులోని గుర్రపుడెక్కను తొలగించే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని మత్స్యకారులు కోరుతున్నారు. ప్రస్తుతం రామసముద్రం చెరువులో చేపల పెంపకం బాగా తగ్గిపోయిందని వారు వాపోతున్నారు.

> **గుర్రపుడెక్కను తొలగించేలా చూస్తాం..**
>
> చెరువులోకి మురుగు నీరు చేరడంతో గుర్రపుడెక్క అధికంగా వ్యాప్తి చెందుతోంది. తొలగించినా కొన్ని రోజుల్లోనే తిరిగి వ్యాప్తిచెందుతోంది. త్వరలోనే గుర్రపుడెక్కను తొలగించి సమస్య తీరేలా చర్యలు తీసుకుంటాం. – జునైద్ అలీ, నీటి పారుదలశాఖ ఏఈ, దుబ్బాక

ఆగుతూ సా..గుతూ బ్రిడ్జి నిర్మాణం



భారీ వాహనాల వల్ల పైకి లేచిన దుమ్ము

సిద్దిపేటఅర్బన్: ఎల్కతుర్తి–మెదక్ జాతీయ రహదారి పనుల్లో భాగంగా మండలంలోని మిట్టపల్లి గ్రామ శివారులో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి రేగి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దుమ్ము లేవకుండా నీళ్లు పట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

బీడీ కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న బాల్‌రాజు

ఏఐటీయూసీ రాష్ట్ర నేత బాల్‌రాజు

సిద్దిపేటకమాన్: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన బీడీ కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏఐటీయూసీ అనేక పోరాటాలు నిర్వహించి కార్మికులకు హక్కులు సాధించామన్నారు. బీడీ కార్మికులకు కనీస వేతనం జీఓ అమలు చేయాలని, కార్మిక సంక్షేమ ఆస్పత్రికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, ఇళ్ల నిర్మాణం, ఆర్థిక సాయం ఇతర పథకాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఉన్న పీఎఫ్ కార్యాలయాన్ని తరలిస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్, సంపత్, బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గోవర్ధన్, రాములు పాల్గొన్నారు.

అందరి కృషితో పర్యావరణ పరిరక్షణ



న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న శరత్‌చౌదరి తదితరులు

రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి

ములుగు(గజ్వేల్): గ్లోబల్ వార్మింగ్‌తో పర్యావరణం దెబ్బతింటోందని, కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని రక్షించడానికి అందరూ కృషి చేయాలని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి పిలుపునిచ్చారు. మండల పరిధి తున్కిబొల్లారంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వైద్యనాథ్, గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, మాజీ అధ్యక్షులు కర్ణాకర్‌రెడ్డి, బాబుగౌడ్, చంటి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ పరామర్శ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పంతుల్‌తండాకు చెందిన కరంటోతు స్వరూప, కవిత ఇటీవల ఓ బస్సు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అదేవిధంగా బీజేపీ హుస్నాబాద్ అసెంబ్లీ కో–కన్వీనర్ జనగామ వేణుగోపాల్ రావు తండ్రి లక్ష్మణ్‌రావు అనారోగ్యంతో ఉండడంతో ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబులెన్స్‌లో మందులు కరువు

హుస్నాబాద్‌రూరల్: పశువుల ఆరోగ్య పరిరక్షణకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టినా అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినా.. ఇప్పటి ప్రభుత్వం మందులు కూడ సరఫరా చేయడం లేదని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ఆదివారం ఆరోపించారు. గ్రామాల్లో రైతుల పాడి పశువులకు అనారోగ్యం వస్తే 1962 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేస్తే పశువు వైద్యులు వాహనంలో ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందించేవారు. ఇప్పుడు సిబ్బంది తప్ప మందులు ఉండడం లేదని, కలెక్టర్ స్పందించి మందులను సమకూర్చాలని కోరారు.

హామీలు అమలుకాకపోతే ఆందోళన బాట

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

సిద్దిపేటఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటాలు తప్పవని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి హెచ్చరించారు. పార్టీ అర్బన్ మండల మూడో మహాసభను సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడారు. అర్బన్‌లో నెలకొన్న సమస్యలపై చర్చించి.. సీసీ రోడ్లు నిర్మించాలని, కోనో కార్పస్ చెట్లు తొలగించాలని, వీధికుక్కలు, కోతులు, దోమల బెడద తప్పించాలని తీర్మానాలు చేశారు. అలాగే పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.10లక్షలతో ఇళ్లు నిర్మించాలని, అసంఘటిత కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈపీఎఫ్ ఆఫీసును సిద్దిపేటలో కొనసాగించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాలస్వామి, శశిధర్, బాలనర్సయ్య, ప్రశాంత్, శిరీష, అర్బన్ మండల కార్యదర్శి రవికుమార్, వెంకటేశ్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



ఎల్ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్

రాష్ట్ర నేత కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కడవేర్గు, చిట్యాల గ్రామాలకు చెందిన ఇద్దరికి వైద్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4లక్షల విలువైన ఎల్ఓసీలను బాధితులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల శస్త్ర చికిత్సల కోసం పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమని తెలుసుకొని తాను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఆయన వెంట శ్రీనివాస్, బాల చందర్, విజయ్, రమేశ్, సుదర్శన్, ముత్తయ్య, నాజర్, వినీత్, లింగారెడ్డి, నరేందర్, వేణు తదితరులు ఉన్నారు.

భవిష్యత్‌కు పునాది వేసేది తల్లిదండ్రులే



మాతృమూర్తులను సన్మానిస్తున్న సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పిల్లల భవిష్యత్‌కు పునాది వేసేది తల్లిదండ్రులేనని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో మాతృ మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మాతృ సమ్మేళనం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ప్రతి విషయాన్ని తార్కికంగా ఆలోచించి ప్రశ్నిస్తారని, వారి ప్రశ్నలకు ఓపికగా సమాధానం చెబితే వారు గొప్ప మేధావులుగా తయారవుతారన్నారు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే మేధస్సు అంతటితో ఆగిపోతుందని చెప్పారు. చిన్నారుల్లో సమాజసేవపై ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. అనంతరం మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్ది వైకుంఠం, కొమరవెల్లి శేఖరం, కాటం రవీందర్, పోకల ప్రసన్న, రేండ్ల కల్పన, విజయ, వినోద్ మొదాని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ శ్రీను



మాట్లాడుతున్న సీఐ శ్రీను

చిన్నకోడూరు(సిద్దిపేట): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గంగాపూర్‌లో పోలీసు కళాబృందంతో ఆదివారం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అ'పూర్వ'సమ్మేళనం

కోహెడరూరల్(హుస్నాబాద్): పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని కోహెడ మండలం బస్వాపూర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05కు చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అంతా కలిసి సందడి చేశారు. చదువుకునే రోజుల్లో జరిగి జ్ఞాపకాలను పంచుకొన్నారు. అప్పుడు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అమరుడైన ఉపాధ్యాయుడు, తోటి విద్యార్థికి నివాళుర్పించారు.

సర్వేకు అందరి సహకారం అవసరం

జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



సర్వే వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



జగదేవ్‌పూర్(గజ్వేల్): రాంనగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న అధికారులు



దుబ్బాకటౌన్: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవ్ కుమార్



కొండపాక(గజ్వేల్): వెలికట్టలో తహసీల్దార్ దిలీప్‌నాయక్

హుస్నాబాద్: కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను, అలాగే మార్కెట్ యార్డులోని నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు ప్రజలతో ఓపికతో వ్యవహరించాలన్నారు. ఇంటింటి సర్వేలో ప్రజల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించామని చెప్పారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే తూకంవేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

జగదేవ్‌పూర్(గజ్వేల్)/దుబ్బాకటౌన్/కొండపాక(గజ్వేల్)/సిద్దిపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని జగదేవ్‌పూర్ మండల ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజొద్దీన్, కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో జరుగుతున్న సర్వేను కమిషనర్ రమేశ్ కుమార్‌తో కలిసి తహసీల్దారు సంజీవ్ కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక మున్సిపల్ పరిధిలో 55మంది, అలాగే మండల పరిధిలో 87 మంది ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రవీందర్ తదితరులున్నారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్, లకుడారం, వెలికట్ట గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్లు మల్లికార్జున్‌రెడ్డి, దిలీప్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు తదితరులు పాల్గొన్నారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీం మియా కోరారు. పాండవపురం(బొగ్గులోనిబండ), మిట్టపల్లి, ఎల్లుపల్లి, బూరుగుపల్లి తదితర గ్రామాలలో సర్వే తీరును ఆయన పర్యవేక్షించారు. ఆర్ఐ బాలయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీపీఎస్ అభ్యర్థులను గెలిపించాలి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికలలో సీపీఎస్ అభ్యర్థులనే గెలిపించాలని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముకి కమలాకర్ కోరారు. ఆదివారం బెజ్జంకిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎంఎల్‌సీలుగా గెలిచిన వారెవరు సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఆ సంఘం నాయకులు రామంచ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట సుతారి, సెంట్రింగ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎంపికచేశారు. ఆ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షుడు దుబాల శ్రీశైలం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడుగా ఆవునూరి శంకర్, ఉపాధ్యక్షుడుగా వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా కనకయ్య, సంయుక్త కార్యదర్శిగా శేఖర్ తదితరులను నియమించారు.

◆ వనిత క్లబ్ అధ్యక్షురాలికి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణికి వనిత క్లబ్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్నారని, వాసవి క్లబ్ సభ్యుడు వీరేశం ఆదివారం తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన క్లబ్ ప్రాంతీయ సదస్సులో ఈ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. వివిధరంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డు వరించిందని వీరేశం తెలిపారు.

◆ ఉత్సాహంగా రెడ్డి సంఘం ఎన్నికలు



దుబ్బాక: పట్టణంలో పుర్మరెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. అధ్యక్షుడుగా కిష్టంగారి సుభాష్‌రెడ్డి సమీప అభ్యర్థి గుండెల్లి నరేశ్‌రెడ్డిపై 39ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడుగా పాతూరి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎంగారి అనిల్‌రెడ్డి, కార్యదర్శిగా లక్కిరెడ్డి లింగారెడ్డి, కోశాధికారిగా గుడికందుల సందీప్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు.

సౌమ్యుడు, నిత్యకృషీవలుడు ఎల్లయ్య

రిటైర్డ్ డీపీఓ పోచయ్య



ఎల్లయ్య దంపతులను సన్మానిస్తున్న నాయకులు, ఉద్యోగులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉద్యోగరీత్యా సౌమ్యుడు, కృషీవలుడు కెమ్మసారం ఎల్లయ్య అని సిద్దిపేట ఏకలవ్య ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ డీపీఓ కెమ్మసారం పోచయ్య ప్రశంసించారు. ఇటీవల ఆర్‌టీసీలో ఉద్యోగ విరమణ పొందిన ఎల్లయ్య రాజమణి దంపతులను మాజీ తహసీల్దార్ ఎన్‌వై గిరి, ఈఈడబ్ల్యూఎస్ ప్రధాన కార్యదర్శి దేవర కనకయ్యతో కలిసి ఆయన ఆదివారం ఘనంగా సన్మానించారు. సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీలో 30 యేళ్లు పనిచేసి, ఐదుసార్లు ఉత్తమ డ్రైవర్‌గా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఎల్లయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ యూఎస్ ప్రధాన కార్యదర్శి కెమ్మసారం రవీందర్, విద్యుత్ శాఖ ఏఈలు కెమ్మసారం కనకయ్య, మల్లేశం, మల్లయ్య, నర్సింహులు, యాదగిరి, రవి, రాజేశ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.